క్లుప్తంగా

నేడు మెగా జాబ్‌మేళా

చిలకలూరిపేట: ప్రముఖ స్వచ్ఛంద సంస్థ అసిస్ట్ ఇండియా ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళాను మంగళవారం సంస్థ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు సంస్థ కో ఆర్డినేటర్ డేవిడ్ తెలిపారు. ఈ జాబ్‌మేళాలో స్కిల్‌సోనిక్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, ఫ్లిప్‌కార్ట్, హెటిరో డ్రగ్స్, ముత్తూట్ ఫైనాన్స్ వంటి కంపెనీలు పాల్గొని ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని తెలిపారు. 18 నుంచి 35 సంవత్సరాల లోపు వయసు ఉండి ఆసక్తిగల అభ్యర్థులు తమ విద్యార్హతలతో కూడిన సర్టిఫికేట్లతో ఉదయం 9 గంటల నుంచి నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు.

బ్యూటీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ

నరసరావుపేట రూరల్: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 3వ తేదీ నుంచి బ్యూటీషియన్ కోర్సులో ఉచిత ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ ఎస్.నీలోఫర్ సోమవారం తెలిపారు. నరసరావుపేట మండలం రావిపాడులోని శిక్షణాసంస్థ కార్యాలయంలో 35రోజుల పాటు శిక్షణ ఇస్తామని తెలిపారు. ఉచిత వసతి, భోజన సౌకర్యాలు కల్పిస్తారని వివరించారు. పది చదువుకుని 19 నుంచి 45 ఏళ్ల వయస్సు కలిగిన మహిళలు ఈ కోర్సులో చేరేందుకు అర్హులని తెలిపారు. సమాచారం కోసం 08647-221916, 9703120524, 6300466010 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

సీఆర్ విద్యార్థుల సత్తా

నాదెండ్ల: గణపవరం చుండి రంగనాయకులు కళాశాలలో ఎయిడెడ్ అధ్యాపకుల ఉద్యమ నేత ఎంజే మాణిక్యరావు శతజయంతి ఉత్సవాలు నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం చిలకలూరిపేట నియోజకవర్గస్థాయిలో ఆర్‌సీటీఏలో జరిగిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందించారు. విద్యార్థులు-సామాజిక బాధ్యత అనే అంశంపై వ్యాసరచన పోటీల్లో విద్యార్థి హుస్సేన్‌బేగ్ ప్రథమబహుమతి, జునైద్‌ఖాన్ ద్వితీయ బహుమతి సాధించారు. నేటి విద్యావ్యవస్థ-లోటుపాట్లు అనే అంశంపై వక్తృత్వ పోటీల్లో మాధురి ప్రథమస్థానం, సాయిసంజన ద్వితీయ స్థానం సాధించారు. ప్రిన్సిపల్ ఏబీపీ మనోహర్, అధ్యక్షుడు చుండి వేణుగోపాల్, డైరెక్టర్ రంగనాయకులు, వైస్‌ప్రిన్సిపల్ సీహెచ్ చైతన్య అభినందించారు.

రూ.2.60 లక్షలకు లడ్డూ ప్రసాదం

రొంపిచర్ల: స్థానిక బీసీ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయకుని పందిట్లోని లడ్డూ ప్రసాదాలను భక్తులు సోమవారం రూ.2.60 లక్షలకు వేలంపాటలో పాడుకున్నారు. 15 కేజీల లడ్డూను తన్నీరు వీరయ్య రూ.2 లక్షలకు దక్కించుకున్నారు. 9 కేజీల లడ్డూ ప్రసాదాన్ని వల్లెపు రమణయ్య రూ.60 వేలకు పాడుకున్నారు. అనంతరం విగ్రహాన్ని మేళతాళాల మధ్య నిమజ్జనానికి తరలించారు.

పల్నాడు జిల్లాకు జాషువా పేరు పెట్టండి

నరసరావుపేట: పల్నాడు జిల్లాకు గుర్రం జాషువా పేరు పెట్టాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సాధన సమితి (ఎంఆర్‌పీఎస్ఎస్) నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ పీజీఆర్‌ఎస్‌లో కలెక్టర్ పి.అరుణ్‌బాబుకు వినతిపత్రం సమర్పించారు. తొలుత కలెక్టరేట్‌లో ప్రదర్శన నిర్వహించారు. ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షులు చింతిరాల మీరయ్య మాదిగ, వినుకొండ నియోజకవర్గ అధ్యక్షులు సురభి కోటేశ్వరావు మాదిగ, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి వేల్పుల పేరయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు ముప్పాళ్ల ప్రభుదాసు మాదిగ, ఈపూరు మండల అధ్యక్షులు ముప్పాళ్ళ పెద్ద గురవయ్య తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాహుల్ దిష్టిబొమ్మ దహనం

నరసరావుపేట: దేశ ప్రధాని నరేంద్రమోదీ తల్లిపై విపక్షనేత రాహుల్‌గాంధీ వ్యాఖ్యలు దుర్మార్గమని బీజేపీ జిల్లా అధ్యక్షులు ఏలూరి శశికుమార్ పేర్కొన్నారు. రాహుల్ వ్యాఖ్యలను నిరసనగా మహిళా మోర్చా ఆధ్వర్యంలో సోమ వారం పట్టణంలోని జిల్లా కార్యాలయం నుంచి పార్టీ శ్రేణులు మల్లమ్మసెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి రాహుల్ గాంధీ దిష్టి బొమ్మ దగ్ధం చేశారు. శశికుమార్ మాట్లాడుతూ మోదీ తల్లిపై విపక్ష నేత రాహుల్ గాంధీ అనుచిత వ్యాఖ్యలు రాహుల్ గాంధీ దిగజారుడుతనానికి, కాంగ్రెస్ దుర్మార్గ రాజకీయాలకు ఇది పరాకాష్ట అన్నారు. గతంలో ఇలా వ్యాఖ్యానించినందుకు దేశ ప్రజలు కాంగ్రెస్‌కు, రాహుల్ గాంధీకి తగిన విధంగా బుద్ధి చెప్పారని, ఈసారి కూడా ప్రజలు బీహార్ ఎన్నికలలో తమ ఓటుతో తప్పక బుద్ధి చెప్తారని హెచ్చరించారు. జి.గాయత్రి, మేకల హనుమంతరావు, కొక్కెర శ్రీనివాస్, పరాంకుశం శ్రీనివాస్, దర్శులు శెట్టి హనుమంతరావు, కట్టా సుబ్బారావు పాల్గొన్నారు.

రాజన్నా... నిను మరువమన్నా...

- పర్యాటక, పారిశ్రామిక రంగాలకు తొలిబీజం వేసింది వైఎస్సార్
- యడ్లపాడుతో వైఎస్సార్‌ది విడదీయరాని బంధం
- వర్ధంతి సందర్భంగా మహానేతను స్మరించుకున్న ప్రజలు


వైఎస్సార్ సాధించిన దేశంలోని అతిపెద్ద స్పైసెస్ పార్కు


చారిత్రక పర్యాటకంగా నిలిచిన కొండవీడుకోట గిరిదుర్గం

యడ్లపాడు: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో చెరగని ముద్ర వేసిన దివంగత మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి. పర్యాటకంగా చారిత్రక కొండవీడుకోట అభివృద్ధికి ఊపిరిపోసి, పారిశ్రామికంగా దేశంలోనే అతిపెద్ద స్పైసెస్ పార్కును నెలకొల్పాలన్న గొప్ప సంకల్పంతో అప్పటి వరకు సాదాసీదాగా ఉన్న యడ్లపాడు మండలాన్ని ప్రపంచస్థాయికి తీసుకెళ్లిన ఘనత ఆయనదే. రైతులు, పారిశ్రామికులు, యువత, వ్యాపారులు, పర్యాటక ప్రేమికులకు ఈ రెండో ప్రాజెక్టులు ఎంతో దోహదమవుతున్నాయి. వీటివల్ల భావితరాలకు ఎంతో మేలు జరగనుంది. అలాగే రాష్ట్రాలకి ఆర్థిక పరిపుష్టి లభించనుంది. సెప్టెంబర్ రెండోతేదీన వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించేందుకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు సిద్ధమవుతున్నారు. ఈ సందర్భంగా యడ్లపాడు మండల ప్రజలు ఆయనతో తమకున్న అనుబంధాన్ని, ఈ ప్రాంతంలో శాశ్వతంగా నిలిచేలా చేపట్టిన ప్రగతిని గుర్తు చేసుకుంటున్నారు. ఆయన పోషించిన కీలక పాత్రను స్మరించుకుంటూ ప్రజలు ఆయనకు ఘనంగా నివాళులర్పిస్తున్నారు.

రాజన్న ఆశయాలకు అద్దం పట్టే 'స్పైసెస్ పార్క్'

ఉమ్మడి గుంటూరు జిల్లాను మిర్చికి కేంద్రంగా మార్చాలన్న లక్ష్యంతో వైఎస్సార్ కేంద్ర ప్రభుత్వంతో పోరాడి ఈ పార్కును సాధించి 2008 ఆగస్టు 21న శంకుస్థాపన చేయగా ఈ ప్రాజెక్టు, 2017లో ప్రారంభమైంది. యడ్లపాడులోని మైదవోలు-వంకాయలపాడు పంచాయతీల పరిధిలో 124.29 ఎకరాల్లో ఈ పార్కును నిర్మించారు. అప్పట్లో ఇక్కడ 58 ప్లాట్లలో మౌలిక వసతులు కల్పించి, రూ. 7.5 లక్షల చొప్పున ఎకరం భూమిని 30 ఏళ్ల లీజుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు కేటాయించారు. వ్యవసాయ ఉత్పత్తులను, సుగంధ ద్రవ్యాలను శుద్ధి చేసి ఎగుమతి చేసేందుకు ఈ పార్కు కీలక వేదికగా మారింది. ప్రస్తుతం పలు సంస్థలు ఇక్కడ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేసుకుంటున్నాయి. ఇదే పార్కులో ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐటీసీ భారీ ప్రాసెసింగ్ ప్రాజెక్టును సీఎం హోదాలో ప్రారంభించిన విషయం తెలిసిందే.

'కొండవీడుకోట'కు కొత్త ఊపిరి పోసింది ఆయనే!

కనుమరుగు అవుతున్న శతాబ్దాల చరిత్రను వెలికితీసి, భావితరాలకు అందించాలన్న వైఎస్సార్ సంకల్పమే కొండవీడు కోటకు పూర్వవైభవాన్ని తెచ్చింది. ఈ కోట అభివృద్ధికి వైఎస్సార్ ప్రత్యేకంగా 2007లోనే రూ.5కోట్ల నిధులు కేటాయించి, చారిత్రక వారసత్వ సంపదను కాపాడటానికి కృషి చేశారు. ఆయన చొరవతోనే కొండవీడు కోట పునరుద్ధరణ పనులు ప్రారంభమయ్యాయి. కోటలోని శిథిలమైన నిర్మాణాలను పునరుద్ధరించడం, పర్యాటకులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడం, కొండలపైకి సందర్శకులు సులభంగా చేరుకునేందుకు ట్రాక్‌రోడ్డు, ఘాట్‌రోడ్ల ఏర్పాటు పనులకు నాంది పలికింది ఆయనే. వైఎస్సార్‌సీపీ హయాంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో రెండోదశ ఘాట్‌రోడ్డుతో పాటు కొండవీడు-నగరవనం పేరిటా భారీగా నిధులు విడదల చేసి సందర్శకులకు ఎన్నో మౌలిక సదుపాయాల్ని కల్పించి గిరిదుర్గం అభివృద్ధికి సహకారం అందించిన విషయం తెలిసిందే.

మహానేత తొలి మినీ పాదయాత్ర

వైఎస్సార్ ముఖ్యమంత్రి కావడానికి ముందు, ప్రజల సమస్యలను తెలుసుకోవడానికి అనేక పాదయాత్రలు చేశారు. అయితే, ఆ యాత్రలన్నింటికీ ప్రేరణగా నిలిచింది యడ్లపాడు మండలం ఉన్నవ గ్రామం నుంచి ప్రారంభమైన తొలి మినీ పాదయాత్రే. ఈ గ్రామం నుండి ప్రత్తిపాడు మీదుగా వైఎస్సార్ ఈ మినీ పాదయాత్రను ప్రారంభించారు. ఈ యాత్రకు ముందు, ఆయన బోయపాలెం గ్రామంలోని పురాతన శ్రీ పార్వతీదేవి అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించి, ఆశీస్సులు తీసుకున్నారు. ఈ మినీ పాదయాత్ర కేవలం ఒక పర్యటనగా మాత్రమే కాకుండా, వైఎస్సార్ ఆ తరువాత చేపట్టిన సుదీర్ఘ పాదయాత్రలకు తొలి అడుగుగా చరిత్రలో నిలిచిపోయింది.

నేడు వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాలు

నరసరావుపేట: దివంగత మహానేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని పలుచోట్ల కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే, పార్టీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సోమవారం పేర్కొన్నారు. ఉదయం 9గంటలకు లింగంగుంట్లలోని పార్టీ జిల్లా కార్యాలయంలో వైఎస్సార్ విగ్రహానికి ఘనంగా నివాళులర్పించటం జరుగుతుందన్నారు. ఉదయం 8:30 గంటలకు జిల్లా పార్టీ కార్యాలయం, 8:45కు లింగంగుంట్ల దగ్గర నూతనంగా నిర్మించబడిన గవర్నమెంట్ హాస్పిటల్లో అనారోగ్యంతో ఉన్న రోగులకు పండ్లు పంపిణీ చేస్తామన్నారు. 9గంటలకు కేర్ పబ్లిక్ స్కూల్ వద్ద, 9.15కు రామిరెడ్డిపేటలోని పాతసమితి ఆఫీస్ వద్ద, 9.45కు 32వ వార్డు మిట్టబజార్, 10 గంటలకు 34వ వార్డు బీసీ కాలనీ, 10.5కు ఒకటవ వార్డు సీబీఎన్ కాలనీ, 10.30కు ఐదవ వార్డు క్రిస్టియన్‌పాలెం, 10:45కు ఆర్‌టీసీ బస్టాండ్ వద్దనున్న వైస్సార్ ఎంప్లాయిస్ అసోసియేషన్, 11 గంటలకు 60 అడుగులరోడ్డులోని బొల్లా బ్రహ్మనాయుడు ఇంటి వద్ద, 11.15కు 12వ వార్డు షాలెంనగర్, 11.30కు 11వ వార్డు ప్రకాష్‌నగర్ రిక్షాసెంటర్, 11.45కు రెడ్డినగర్‌లోని వైఎస్సార్ విగ్రహాల వద్ద నివాళులు అర్పించటం జరుగుతుందని పేర్కొన్నారు.

నేడు వైఎస్సార్ వర్ధంతి

వినుకొండ: మహానేత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కార్యాలయ సిబ్బంది తెలిపారు.

వైఎస్సార్ స్ఫూర్తితో ముందడుగు వేద్దాం

మాజీ మంత్రి విడదల రజిని


మాట్లాడుతున్న మాజీమంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: దివంగత మహానేత డాక్టర్ వైఎస్సార్ స్ఫూర్తితో పార్టీ కార్యక్రమాలు చేపడదామని మాజీ మంత్రి విడదల రజిని చెప్పారు. పట్టణంలోని ఎన్ఆర్‌టీ రోడ్డులో ఉన్న మాజీ మంత్రి నివాసంలో నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకుల సమావేశం సోమవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుతం ప్రజలతో సంబంధం లేని, ప్రజా సంక్షేమం ఎరుగని రెడ్‌బుక్ పాలన మాత్రమే కొనసాగుతుందన్నారు. ఎందరో దివ్యాంగులు తమ జీవితాలకు ఆసరాగా ఉన్న పింఛన్లు సైతం కోల్పోయి ఎలా బతకాలో తెలియని దీన స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం ప్రశ్నించే వారిపై కేసులు పెట్టడం మినహాయించి ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మేలు ఏమీలేదన్నారు. నాడు దివంగత ముఖ్యమంత్రి సంక్షేమం ఎలా ఉంటుందో బాటలు వేసి చూపారని వెల్లడించారు. ఆయన తనయుడు మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి తండ్రి చూపిన బాటలో ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారని గుర్తు చేశారు. సంక్షేమ పథకాల అమలులో ఏనాడు కులం, మతం, పార్టీ అనే విభేదాలు చూడలేదని పేర్కొన్నారు. తిరిగి అలాంటి పాలన తెచ్చుకొనేందుకు ప్రజలకు అండగా నిలిచి పోరాడేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని మంగళవారం నిర్వహించి ఘన నివాళులు అర్పిద్దామని చెప్పారు. నియోజకవర్గంలోని అన్ని మండలాలు, గ్రామాలు, పట్టణంలోని అన్ని వార్డులకు సంబంధించిన నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమంలో మమేకం కావాలని కోరారు. ముందుగా మంగళవారం ఉదయం 9 గంటలకు తన నివాసం వద్ద వైఎస్సార్‌కు నివాళులు అర్పించి, వాడవాడలా ఉన్న విగ్రహాలకు నివాళులు అర్పిద్దామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ దరియావలి, చిలకలూరిపేట, నాదెండ్ల, యడ్లపాడు మండలాల పార్టీ అధ్యక్షులు దేవినేని శంకరరావు, మంగు ఏడుకొండలు, వడ్డేపల్లి నరసింహరావు, ఏకాంబరపు సునీత, తాళ్ల అంజిరెడ్డి, కొండవీటి ఆంజనేయులు, మద్దూరి కోటిరెడ్డి, పఠాన్ తలహాఖాన్, ఉడతా వెంకటేశ్వరరావు, కొచ్చెర్ల కిషోర్, భాస్కరరెడ్డి, రాచమంటి చింతారావు, కౌన్సిలర్లు షేక్ యూసుఫ్‌అలి, వడితే కోట్యానాయక్ పాల్గొన్నారు.

దటీజ్.... రాజన్న!!



మహానేత వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి తొలిసారిగా ముఖ్యమంత్రి అయిన తరువాత రాష్ట్రంలో మొదటిసారిగా బొల్లాపల్లి మండలంలో భూపంపిణీ చేపట్టి మండల ప్రజల్లో చిరస్మరణీయుడుగా నిలిచాడు. 2004లో అధికారం చేపట్టగానే ఎస్సీ ఎస్టీలకు భూ పంపిణీ చేసిన ఘనత రాజన్నదేనని ఇప్పటికే చెప్పుకుంటారు. తొలిసారి ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని బొల్లాపల్లి మండలం సరికొండ పాలెం గ్రామంలో భూ పంపిణీ చేసి అందరి మన్ననలు పొందారు. అప్పట్లో సమగ్ర భూ అభివృద్ధి పథకంలో (సీఎల్‌డీపీ) భాగంగా భూమిలేని నిరుపేదలకు భూ పంపిణీ చేసి, ఆ భూములను అన్ని విధాల పంటల సాగుకు అనుకూలంగా అభివృద్ధి పరచి వారి ఆర్థిక అభివృద్ధికి ఎదుగుదలకు దోహదపడ్డారు. సరికొండ పాలెం టేనెంట్స్ కో-ఆపరేటివ్ సొసైటీ భూములను ఆ గ్రామంలో నిరుపేదలైన ఎస్సీ ఎస్టీలు సుమారు185 మందికి పైగా వారికి 350 ఎకరాలకు పైగా భూమిని పంపిణీ చేశారు. ఆ భూములకు బోర్లు, మోటర్లు, కరెంటు సౌకర్యంతో పాటు నీళ్లకు చెరువును ఏర్పాటు చేసి వారి అభివృద్ధికి బాటలు వేశారు. ఇప్పటికీ ఆ భూముల్లో సిరులు పండిస్తూ రైతులు గుండెల్లో కొలువై ఉన్నాడని చెప్పుకుంటారు. నిరుపేద కుటుంబాల పోషణతోపాటు పిల్లలను చదివించుకుంటూ ఆర్థికంగా ఎదిగామని రాజన్నను మరువలేమని గుర్తు చేసుకుంటారు.

– బొల్లాపల్లి

జాతీయ ఫ్లోర్ బాల్ పోటీలకు కే-రిడ్జి విద్యార్థులు

నరసరావుపేట ఈస్ట్: గుంటూరురోడ్డులోని కే-రిడ్జి పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయి ఫ్లోర్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ జి.బర్నబాస్, వ్యాయామ ఉపాధ్యాయుడు ఎం.కిషోర్‌బాబు సోమవారం తెలిపారు. ఇటీవల నిర్వహించిన అంతర్ జిల్లాల ఫ్లోర్ బాల్ పోటీలలో భాగంగా ఎంపిక చేసిన క్రీడాకారుల నుంచి రాష్ట్ర జట్టును ప్రకటించారని తెలిపారు. తమ పాఠశాల విద్యార్థులు అండర్-14 బాలికల విభాగంలో ఎన్.గురుహంసిని, బొల్లా యశస్విని, ఎస్.లీలాలోహిత, అండర్-19 బాలుర విభాగంలో వెంకటకోటేశ్వరరావు రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారని వివరించారు. ఈనెల 4వతేదీ నుంచి బీహార్‌లో జరగనున్న జాతీయస్థాయి ఫ్లోర్ బాల్ పోటీలలో తమ విద్యార్థులు ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రాతినిథ్యం వహిస్తారని తెలిపారు. విద్యార్థులను పాఠశాల చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు, డైరెక్టర్ కోమటినేని నాసరయ్య, ప్రిన్సిపల్ బర్నబాస్, క్యాంపస్ ఇన్‌చార్జ్ కోట బాపూజీ, వ్యాయామ ఉపాధ్యాయులు కిషోర్‌బాబు, శేషగిరి, మహిత అభినందించారు.

స్కిప్పింగ్ పోటీల్లో సంసీథ్ విద్యార్థులు సత్తా

శావల్యాపురం: మండలంలోని కనమర్లపూడి గ్రామ సమీపంలో సంసీథ్ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి స్కిప్పింగ్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనపరిచినట్లు పాఠశాల వ్యాయమా ఉపాధ్యాయులు కె.నాగరాజు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ సాగర్‌బాబు మాట్లాడుతూ కర్నూలు జిల్లా డోన్‌లోని లిటిల్ ఫ్లవర్ ఇంగ్లిషు మీడియం స్కూల్లో జరిగిన ఆదివారం 8వ రాష్ట్రస్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీల్లో అండర్-14 విభాగంలో ఎస్.హంస వర్షిత, ఎండురెన్సులో బంగారు పతకం, స్పీడ్ స్ప్రింట్ విభాగంలో కాంస్య పతకం సయ్యద్ హర్షద్ డబల్ అండర్-12 విభాగంలో జి.యశ్వంత్, స్పీడ్ డబల్‌లో బంగారు పతకం, డి.షారుక్ ఎండురేన్సు విభాగంలో రజత పతకం సాధించినట్లు తెలిపారు. భవిష్యత్‌లో మంచి ప్రతిభ చూపి పాఠశాల తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకోవాలన్నారు.రాష్ట్రస్థాయిలో పతకాల సాధించిన అక్టోబరు నెలలో ముంబాయిలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు, విద్యార్థులను పాఠశాల యాజమాన్యంతో ప్రిన్సిపాల్ సాగర్‌బాబు ప్రత్యేకంగా అభినందించారు.

బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో శావల్యాపురం బాలికలు సత్తా చూపారు

శావల్యాపురం: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలల్లోని జూనియర్ కళాశాల విద్యార్థులు 11వ అంతర్ జిల్లాల రాష్ట్రస్థాయిలో జరిగిన ఈనెల 28 నుంచి 31 వరకు జరిగిన బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో ఉమ్మడి గుంటూరు జిల్లా మహిళల జట్టు రన్నర్స్ సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బోడ్డపాటి విజయలక్ష్మి సోమవారం తెలిపారు. ప్రకాశం జిల్లా చేవూరులో జరిగిన పోటీల్లో ఇంటరు విద్యార్థులు వేముల దివ్య, ముట్లూరు లూథియా సబ్ జూనియర్ విభాగంలో వినుకొండ పట్టణంలోని జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి బండారు రవళి (10వ తరగతి) రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. సెప్టెంబరు నెలాఖారులో తమిళనాడులో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ప్రోత్సహించిన ఉమ్మడి గుంటూరు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సెక్రటరీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, ప్రెసిడెంటు ఎనుముల శివశంకరు రాగుల రాధాకృష్ణమూర్తి తదితరులను ప్రత్యేకంగా అభినందించారు.

విద్యుత్ తీగెలు తొలగించాలి

నరసరావుపేట: వినుకొండ మండలం బ్రాహ్మణపల్లి, విఠంరాజుపల్లి గ్రామాల మధ్య ఎన్ఎస్‌పీ కాలువపై కరెంటు స్తంభం తీగలను తొలగించాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ పీజీఆర్‌ఎస్‌లో కలెక్టర్ పి.అరుణ్‌కుమార్‌కు అందజేశారు. విద్యుత్ తీగెలు ఎన్ఎస్‌పీ కాలువపై రాకపోకలకు అడ్డంగా వేశారని, వీటిని తొలగించాలని, దీనికి అయ్యే ఖర్చులు ప్రభుత్వమే భరించాలని కోరారు. దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం (పీడీఎం) సీనియర్ నాయకులు వై, వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు, జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ, పగడాల చిన్న కోటిరెడ్డి, వై.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు పనిచేయకపోవడంపై దీక్ష!

నరసరావుపేట: పట్టణంలోని ప్రధాన రహదారుల్లో ఉన్న సీసీ కెమెరాలు పనిచేసే విధంగా వెంటనే చర్యలు తీసుకోవాలని ఎంహెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి పేర్కొన్నారు. ఈ మేరకు లాల్‌బహదూర్ కూరగాయల మార్కెట్ సెంటర్‌లో కొద్దిసేపు నిరసన దీక్ష చేశారు. దీనిపై స్పందించిన సీఐ హైమారావు సీసీ కెమెరాలు పనిచేసే విధంగా చర్యలు తీసుకుంటానని ఇచ్చిన హామీ మేరకు తాను దీక్ష విరమించారు. ఈ సందర్భంగా మస్తాన్‌వలి మాట్లాడుతూ ప్రధాన రహదారుల్లో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలు పని చేయట్లేదన్నారు. దీని వలన రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయంలో ప్రమాదానికి కారణమైన వాహనాలు తప్పించుకునేందుకు దోహదం కలుగుతుందన్నారు. ఇటీవల తన భార్యను ఓ ఆటో ఢీకొనడంతో భుజం ఎముక విరిగి శస్త్రచికిత్స చేయాల్సి వచ్చిందన్నారు. ఢీకొట్టిన ఆటో కన్పించకుండా పోయిందన్నారు. దీంతో తానే హాస్పిటల్ల ఖర్చులు భరించాల్సి వచ్చిందన్నారు. సీసీ కెమెరాలు పనిచేసి ఉంటే ఆ ఆటోను వెంటనే కనుగొనే అవకాశం ఉండేదన్నారు. ఇటువంటి సంఘటనల్లో ప్రమాద బారిన పడిన వ్యక్తి హాస్పిటల్ల పాలై ఆర్థికంగా ఇబ్బందిపడుతున్నారన్నారు.